క్లుప్తంగా

నేడు, రేపు రాజంపేటలో నీటి సరఫరా బంద్

రాజంపేట : ఈనెల 4, 5వ తేదీలలో రాజంపేట పట్టణానికి అన్నమయ్య నీటి పథకం నుంచి రావాల్సిన నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు కమిషనర్ జనార్దన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కార్యాలయం, ఎస్.ఎర్రబల్లి మెయిన్‌రోడ్డు దగ్గర పైపులైను మరమ్మతుల చేస్తున్న దృష్ట్యా నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఉస్మాన్‌నగర్, కొలిమివీధి, ఎగువగడ్డ, మన్నూరు, గంగిరెడ్డిపాలెం, ఆర్ఎస్‌రోడ్డు, రాజీవ్‌నగర్, నూనివారిపల్లెరోడ్డు, బాలాజీ నగర్, కనకమ్మ వీధి, భవానీ నగర్, బండ్రాళ్ల వీధి, హైదరనగర్, ఈడిగపాళెం, విద్యుత్‌నగర్, ఆర్అండ్‌బీ బంగ్లా, లక్ష్మీనగర్, నలందా కాలేజీ, సాయినగర్, బలిజపల్లె దళితవాడ, సరస్వతీపురం, మహబూబ్‌నగర్, సుద్దగుంతలు, ఆకులవీధి, రామ్‌నగర్, గడ్డివీధి, ముకందరగడ్డ, నూనివారిపల్లె, ఎర్రబల్లి, బలిజపల్లెలో నీటి సరఫరాలో అంతరాయముంటుందన్నారు.

ఏఎస్ఐ నరసింహులు మృతి



రైల్వేకోడూరు : రాజంపేటలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహులు(61) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే రైల్వేకోడూరు మండలం ఎస్.ఉప్పరపల్లెకు చెందిన నరసింహులు జిల్లాలో అనేక చోట్ల పోలీస్‌శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. మృతుడి మృతదేహానికి పలువురు పోలీసులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నరసింహులు మృతదేహం స్వగ్రామం ఎస్.ఉప్పరపల్లెకు చేరుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహానికి సరుకుల వితరణ

రాయచోటి అర్బన్ : పట్టణానికి చెందిన ఒక పేదింటి యువతి వివాహానికి జిన్నా సేవాసమితి సభ్యులు తమవంతుగా సహాయమందించారు. పట్టణంలోని రవిహాల్ ప్రాంతంలో బీడీలు చుట్టుకుని జీవించే నిరుపేద యువతికి వివాహం నిశ్చయమైంది. విషయాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవాజ్‌క్రిష్ జిన్నా సేవాసంస్థకు తెలియజేయగా స్పందించిన వారు యువతి వివాహానికి అవసరమైన రూ.10 వేలు విలువచేసే సరుకులను ఉచితంగా అందజేశారు. కాగా నవాజ్‌క్రిష్ వివాహానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం



సాయినారాయణను సన్మానిస్తున్న దృశ్యం

నందలూరు : పొత్తపి ప్రాథమిక పాఠశాలకు చెందిన రిటైర్డ్ టీచర్ సాయినారాయణను బెంగళూరుకు చెందిన నువ్వుల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీటీసీ మోదుగల చంద్రశేఖర్ మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య విద్యాపరంగా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. స్థానిక నాయకులు గోపాలకృష్ణయ్య, సాంబారావు లక్షుమయ్య, మోదుగల రమణ, నరసింహులు, జయరామయ్య, సాయిమురళీ, కృష్ణయ్య పాల్గొన్నారు.

6న వీహెచ్‌పీ జిల్లా స్థాయి సమావేశం

రామాపురం : అన్నమయ్య జిల్లా విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ కార్యకర్తల సమావేశం 6న ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో జరుగుతున్నట్లు జిల్లా భజరంగ్‌దళ్ సేవా ప్రముఖ్ వీరారెడ్డి తెలిపారు. సమావేశానికి జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుంచి ఆయా సంఘాల కార్యకర్తలు హాజరవుతారని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

గాలివీడు : పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని మండల విద్యాధికారి-1 పిల్లి నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తబండివాండ్లపల్లె, నూలివీడు, బోరెడ్డిగారిపల్లె, ఈడిగపల్లె, సుగాలితాండ, రెడ్డివారిపల్లె, తూముకుంట, ఎగువమూల ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, పలు రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ విద్యార్థులు గైర్హాజరును తగ్గించాలని, పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి

లక్కిరెడ్డిపల్లె : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ వై.విజయభాస్కర్, మహ్మద్ రఫీక్‌లు పేర్కొన్నారు. గురువారం ఆసుపత్రిని వారు సందర్శించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగంకు తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు అవసరమయ్యే అన్ని వసతులు ఉన్నాయని, గర్భిణుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నామని తెలియజేశారు.

సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్

- గడప గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే జగనన్న ఆశయం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



వృద్ధుడికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : సంక్షేమ పథకాల రారాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెం మండలం చాకిబండ గ్రామంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని దేవరవాండ్లపల్లె, యానాది కాలనీ, అంబాబత్తినవాండ్లపల్లె, చాకిబండ కస్పా, కస్పా దళితవాడలలో శ్రీకాంత్‌రెడ్డి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఆప్యాయంగా ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే జగనన్న ఆశయమన్నారు. పారదర్శకంగా, ఆదర్శంగా జగన్ పాలన కొనసాగుతోందన్నారు.

గడప గడపనా ఆత్మీయ స్వాగతం

ప్రతి ఇంటా ఆత్మీయ ఆదరణ, ఆప్యాయతతో కూడిన పలకరింపులతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చాకిబండ గ్రామంలో వేడుకగా కొనసాగింది. సంక్షేమ అభివృద్ధి పథకాలను పారదర్శకంగా సంతృప్త స్థాయిలో తమ గడప వద్దకే చేరవేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజానీకం నిండు మనసుతో ఆశీర్వదించింది. పింఛన్ల నుంచి పీజుల దాకా ఇళ్ల పట్టాల నుంచి అమ్మ ఒడి వరకు నాలుగేళ్లలో 99 శాతం హామీలను నెరవేర్చి ప్రజల చెంతకు చేరుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ బావుటాను ప్రతి ఇంటికీ వెళ్లి శ్రీకాంత్‌రెడ్డి అందించారు. సమస్యలను తెలుసుకుంటూ అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తుండటంతో మంచి స్పందన లభించింది. అర్హత ఉండి ఇంకా ఏమైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని, అర్హులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. దేవరవాండ్లపల్లెలో రామాలయంలో పూజలు నిర్వహించారు. లవకుమార్‌రెడ్డి అనే దివ్యాంగుడు డిగ్రీ వరకు చదివానని స్కూటీ వాహనం ప్రభుత్వం నుంచి ఇప్పించాలని కోరారు. యానాది కాలనీలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. అదే గ్రామానికి చెందిన ఆనంద్ భార్య భారతి విద్యుత్ ప్రమాదంలో కుడికాలు పోయిందని తనకు కృత్రిమ కాలు మంజూరు చేయించాలని కోరారు. అంబాబత్తినవాండ్లపల్లెలో వేల్పుచెర్ల నాగులమ్మ తనకు రెండు చెవులు వినపడవని, చెవిటి మిషన్ ఇప్పించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణపై ఎమ్మెల్యే ఆరా తీశారు. షేక్ అఫ్జల్ అనే దివ్యాంగుడు తనకు వీల్ చైర్, షబ్బీర్ అనే దివ్యాంగుడు తనకు చెవుడు మిషన్‌ను ఇప్పించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏజాస్ అలీఖాన్, ఎంపీటీసీ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, చుక్కా అంజనప్ప, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మహమ్మద్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, షరీఫ్, జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పాపిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

మండలంలోని కలిబండకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి బాలకృష్ణారెడ్డి గత ఏడాదిలో విద్యుత్‌ఘాతంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పరిహారపు ఉత్తర్వులను దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. పరిహారం అందడంపై బాధిత కుటుంబం ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ చిన్నస్వామి నాయక్, టెక్నికల్ ఏఈ నరేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సిబ్బందితో మాట్లాడుతున్న మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్ త్యాగరాజు

సంబేపల్లె : పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని మలేరియా అడిషనల్ డైరెక్టర్ త్యాగరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని దుద్యాల పంచాయతీ వడ్డిపల్లెలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి తిరిగి పరిసరాలను పరిశీలించారు. మురుగు నీరు ఉన్నచోట నీటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. లార్వా సర్వేపై ఆరా తీశారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలు సలహాలు ఇచ్చారు. రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి

రామాపురం : సమస్యలు లేకుండా చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డిలు అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ సభా భవనంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా తాగు నీరు, విద్యుత్, విద్య, వైద్యం, ఉపాధి పశుసంవర్ధక శాఖ, తదితర శాఖలపై చర్చించారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సచివాలయం ఉద్యోగులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని, మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. పక్కా గృహాలు అర్హులైన వారిని గుర్తించి మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులకు తెలియజేశారు. భూమి లేని నిరుపేదలను గుర్తించి ఆసైన్ భూములను మంజూరు చేస్తామని, ఉపాధి పథకం ద్వారా 50శాతం నిధులతో భూముల వద్దకు ఫార్మేషన్ రోడ్డు చేసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వారం డ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ నీళ్లను కాచుకొని తాగాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేదని, జర్వం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హైదర్‌వలి, ఇంచార్జ్ తహసీల్దార్ అరవింద్‌కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, మండల శాఖ, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణపై బాధ్యత కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె : మాత, శిశు సంరక్షణపై బాధ్యత కలిగి ఉండాలని కేర్ క్యాంపెయిన్ అసోసియేట్ లావణ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో మాతాశిశు సంరక్షణపై వైద్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లావణ్య మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణపై గ్రామీణులకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. బిడ్డ కడుపులో పడిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నెలసరి మందులు, కాన్పు అయ్యేంత వరకు ఆ బిడ్డ ఎదుగుదల గురించి తల్లికి అవగాహన కల్పించాలన్నారు. బిడ్డ ప్రసవించిన తరువాత తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిడ్డ ఎదుగుదల గురించి తెలియజేయాలన్నారు. కేర్ క్యాంపెయిన్ అసోసియేట్ వాసవి మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ప్రతినెల డాక్టర్లను సంప్రదించాలని, బిడ్డ ఎదుగుదల గురించి ప్రతినెల పరీక్షలు చేయించుకోవాలన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన వైద్య సేవలు

నందలూరు(రాజంపేట) : విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పల్లెవాసులకు మెరుగైన వైద్యసేవలు పొందగలిగే అవకాశం లభించిందని మండల వైద్యాధికారిణి సృజన అన్నారు. గురువారం నల్లతిమ్మాయపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మండల కేంద్రంలోని ఆరోగ్యకేంద్రంతో సమానంగా వైద్యసేవలందేలా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందన్నారు. విలేజ్‌హెల్త్ క్లినిక్‌కు ఓపీ పెరుగుతోందన్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేయడం జరుగుతోందన్నారు. మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేసి మందులను ఇస్తున్నామన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వండి

పెనగలూరు : తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని సిద్దవరం పంచాయతీ, తిరుమలరాజుపేట దళితులు బీకేఎంయూ, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతో ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఇంటి పట్టా ఇవ్వాలన్నారు. ఈనెల 10వ తేదీలోపు ఇంటిస్థలాలు ఇవ్వకుంటే సామూహిక నిరాహార దీక్ష చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం ఇంటిస్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ, సీపీఐ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూతతో మహిళలకు భవిత

లబ్ధిదారులు	: 1660 మంది
ఆర్థికసాయం	: రూ. 3.11 కోట్లు
ఇప్పటికీ వరకు చేసిన లబ్ధి	: రూ. 8.45 కోట్లు

లక్కిరెడ్డిపల్లె : ప్రజా సంక్షేమమే పరమావధిగా భావిస్తూ పాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని బడుగు బలహీన, మైనార్టీ వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పాలన సాగిస్తున్నారు. సీఎం జగన్ వరుసగా నాల్గవ ఏడాది వైఎస్సార్ చేయూతను సెప్టెంబర్ నెలలో విడుదల చేయనున్నారు. దీంతో 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న అర్హులైన మహిళలకు రూ. 75 వేలు ఇస్తా అని సీఎం జగన్ చెప్పిన మాట నెరవేరినట్టవుతుంది.



నా పేరు రాయదుర్గం వీరమ్మ లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో నివాసిస్తున్నాను. నాకు వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత కింద రెండు విడతలలో రూ. 37500 నగదు జమ చేసింది. ప్రభుత్వం చేసిన సాయంతో నేను పాల వ్యాపారం చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నా. చేయూత సాయంతోపాటు నాకు ప్రభుత్వం నుంచి పాల సేకరణకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ కూడా అందుతుండటంతో సాఫీగా జీవనం సాగుతోంది.



నా పేరు హుస్సేన్ బీ లక్కిరెడ్డిపల్లి మండలం కోనంపేటలో ఉంటున్నాను. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా మూడు విడతల్లో రూ. 56,250లు నగదు అందింది. చేయూత నగదుతో కూరగాయల అంగడి పెట్టుకొని వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా ఒకరిపై ఆధారపడకుండా జీవిస్తున్నాను. వ్యాపారంలో వచ్చిన లాభాన్ని ఇంటి అవసరాలకు వినియోగిస్తున్నాను. సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతోంది.



వైఎస్సార్ చేయూత చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి (ఫైల్)

యోగ సాధనతో ఆరోగ్య పరిరక్షణ



యోగ సాధన చేయిస్తున్న మాస్టర్ మణికాంత్

రాయచోటి అర్బన్ : యోగ సాధన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఎస్. హరినాథరెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి ప్రారంభమైన యోగ శిక్షణా తరగతులను ఆయన దాత తులసీశ్వరరెడ్డితో కలసి లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ టెన్షన్‌కు గురై రకరకాల సమస్యలకు గురవుతున్నారన్నారు. యోగ సాధనలో ప్రతి ఒక్కరూ మనస్సు ప్రశాంతంగా మారి రోగాల బారిన పడకుండా జాగ్రత్తపడవచ్చునన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఏ వయస్సు వారైన తగుజాగ్రత్తలు తీసుకుంటూ యోగసాధన చేయవచ్చునంటూ తెలిపారు.

అన్నదానం..

అన్నదానం ఒక పుణ్యకార్యక్రమమని లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథరెడ్డి, మాజీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్‌లు తెలిపారు. పట్టణానికి చెందిన చిన్నారి మనీష పుట్టినరోజును పురస్కరించుకుని ఆమె తల్లితండ్రులు క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రం విద్యార్థులకు అన్నదానం చేశారు. చిన్నారి మనీష కుటుంబీకులు కేశవరాజు, లక్ష్మి, అఖిల, రష్మిత, లోహిత్‌రాజు, క్లబ్ కోశాధికారి హరీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్, గడికోట కుటుంబాలకు రాయచోటిపై ఎనలేనిప్రేమ



సీఎం జగన్, ఎమ్మెల్యే గడికోట చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కౌన్సిలర్లు, అధికారులు

రాయచోటి అర్బన్ : రాయచోటి నియోజకవర్గంపై స్వర్గీయ మహానేత వైఎస్ఆర్, ఎమ్మెల్యే గడికోట కుటుంబాలకు ఎనలేని ప్రేమ అని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు అన్నారు. రాయచోటి మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినందుకు మున్సిపల్ అధికారులు, పాలకవర్గం మున్సిపల్ కార్యాలయంలో గురువారం సీఎం జగనన్న, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి పట్టణాన్ని పంచాయతీ స్థాయి నుంచి గ్రేడ్-3 మున్సిపాలిటీగా స్వర్గీయ మహానేత వైఎస్ఆర్ అప్‌గ్రేడ్ చేశారన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక జగనన్న సహాయ, సహకారాలతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గ్రేడ్-1కు అప్‌గ్రేడ్ చేయించారన్నారు. ఇందుకోసం శ్రీకాంత్‌రెడ్డి ఎంతో కృషి సల్పినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని చిన్నమండెం మండలం చాకిబండలో గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా అక్కడికి వెళ్లి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున, టీపీఓ లక్ష్మీనారాయణమ్మ, మేనేజర్ రాధ, అకౌంటెంట్ మహేష్, సుబ్బరాయుడు, మాసూమ్‌బాషా, కౌన్సిలర్‌లు నరసింహారెడ్డి, సాదిక్‌అలీ, జానం రాధ, రౌనఖ్ హుస్సేన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ముమ్మరంగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ



నందలూరులో బాలింతకు రేషన్‌ను అందజేస్తున్న సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది



ఓబులవారిపల్లె: టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, అధికారులు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో సర్పంచు జంబు సూర్యనారాయణ చేతుల మీదుగా రేషన్‌ను అందజేశారు. అలాగే భగత్‌సింగ్ కాలనీలో మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లాఖాన్, మండల వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్యదర్శి ఫరూక్‌లు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె మండలంలో..

ఓబులవారిపల్లె : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలకు శ్రేయస్కరమని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ జయపాల్ రెడ్డి, డీఎల్‌పీఓ సుదర్శన్ శర్మ, వైద్యాధికారి గురుమహేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గురుమహేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ ద్వారా గర్భిణీలకు, బాలింతలకు ఎంతోగానో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనుసూయమ్మ గర్భిణులకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతి, అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

సిద్దవటం : తల్లి పాలు బిడ్డకు తాపడం ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ కార్యకర్త బి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ప్రతి తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. ముర్రు పాలు తాగించడం వల్ల బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంతే గాకుండా బిడ్డ ఆరోగ్యంగా కూడా ఉంటారని అమె అన్నారు.

చిట్వేలి : పురిటిబిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక కొత్తబస్టాండ్ అంగన్‌వాడీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శిశువుకు పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో తల్లిపాల ప్రత్యేకతను వివరిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సూపర్‌వైజర్ సుందరమ్మ, అంగన్‌వాడీ వర్కర్ భువనేశ్వరి, హెల్పర్ భాగ్యమ్మ, తల్లులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సర్వే నిర్వహించండి

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీలో డ్రైనేజీ సర్వే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో వలంటీర్లు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట పునరావాసకాలనీకి సంబంధించిన డ్రైనేజీ నీటితో గోవిందంపల్లె చెరువు నీరు కలుషితమవుతున్న విషయాన్ని గ్రామస్తులు, ఏపీఎండీసీ అధికారులు, ఎంపీడీఓ విజయారావు దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఇందుకు వలంటీర్లు పునరావాసకాలనీలో డ్రైనేజీ సర్వే నిర్వహించి ఎంతమందికి ఇంకుడు గుంతలు ఉన్నాయి, లేనివారి వివరాలు తెలియజేయాలన్నారు. నివేదికలను ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డికి పంపిస్తామని, వారు నిధులు మంజూరు చేయడం ద్వారా పనులు చేయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

శ్రామికగర్జనను విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : ఆగస్టు 9న విజయవాడలో జరిగే శ్రామిక గర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ విశ్వనాథ్‌లు కోరారు. గురువారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయా సంఘాల నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9 ఏళ్ల మోదీ పాలనలో కార్మిక వర్గ సమస్యలేవీ పరిష్కారం కాలేదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారంలో కేంద్రం అనుసరిస్తున్న అలసత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహిస్తున్న శ్రామికగర్జనకు కార్మికులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

నందలూరులో రాష్ట్ర క్రికెట్ సెలెక్టర్స్

నందలూరు(రాజంపేట) : నందలూరు క్రికెట్ సబ్ సెంటర్(సీఏవైడీ)ను స్టేట్ క్రికెట్ సెలక్టర్స్‌ను గురువారం సందర్శించారు. వీరిలో సీఏవైడీ–వైఎస్సార్ స్టేడియం నుంచి ఖాజామోహిద్దీన్, ఏసీఏ–మెన్స్ సెలక్టర్ సురేష్‌కుమార్, ఏసీఏ ట్రైనర్ ఆనంద్, సీఏవైడీ సభ్యుడు అకాడమీ అశ్విన్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో ఫేస్ టు ఫేస్ కార్యక్రమం నిర్వహించారు. సెలక్టర్ ఖాజామోహిద్దీన్ మాట్లాడుతూ యంగ్ అండర్ - 12, 14, 16కి చెందిన క్రీడాకారులు చాలా బాగా ఆడుతున్నారన్నారు. మరో సెలక్టర్ సురేష్ మాట్లాడుతూ నందలూరు సబ్‌సెంటర్ నుంచి అమ్మాయిలు క్రికెట్‌లో బాగా వస్తున్నారన్నారు. మంచి ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. నందలూరు సబ్ సెంటర్‌లో క్రికెటర్స్‌కు హెడ్‌కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటయ్యలు బాగా ప్రాక్టీసు చేయిస్తున్నారని అభినందించారు. టోర్నీల్లో రాణించే లక్ష్యాలను సాధించాలన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నేత పల్లె గ్రీష్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.